తీరని తాగునీటి గోస


లింగంపేట: పర్మళ్లలో కుళాయి వద్ద తాగునీరు పట్టుకుంటున్న మహిళలు

- నల్లాల వద్ద గంటల తరబడి క్యూలు
- నీటిని పట్టుకునేందుకు అష్ట కష్టాలు

SAKSHI గ్రౌండ్‌రిపోర్ట్ GROUND REPORT

సాక్షి నెట్‌వర్క్ : ప్రభుత్వాలు మారినా గ్రామాల్లో నీటి 'గోస' తప్పడం లేదు. బిందెడు నీటి కోసం ఉదయం నుంచి బండెడు కష్టాలు పడుతున్నారు. భూగర్భజలాలు చాలా చోట్ల పడిపోయి బోర్లు ఎత్తి పోతున్నాయి.దీంతో వేసవిలో నీటికష్టాలు మరింత పెరగనున్నాయి. పలు చోట్ల పబ్లిక్ నల్లాల నుంచి వచ్చే నీటిని పట్టుకునేందుకు కాలనీవాసులు గంటల తరబడి క్యూలో నిలబడుతున్నారు. చాలా చోట్ల మిషన్ భగీరథ నీరు పూర్తి స్థాయిలో సరఫరా కావడం లేదు.దీంతో నీటి కోసం రోజూ ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో నీటి కష్టాలపై 'సాక్షి' ఆదివారం క్షేత్ర స్థాయి పరిశీలనలో వెలుగులోకి వచ్చిన విషయాలపై ప్రత్యేక కథనం.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో..

రామారెడ్డి మండలవ్యాప్తంగా మిషన్ భగీరథకు లీకేజీల గండం నెలకొంది. తరచూ పైప్ లైన్ లీకేజీలతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. మండలంలోని మొండీవీరన్నపల్లి తండా, సున్నపురాళ్ల తండా, మద్దికుంట గ్రామాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా ప్రజలకు నీళ్లు అందిస్తున్నారు.లింగంపేట మండలం పర్మళ్ల గ్రామంలో గ్రామ పంచాయితీ బోరుబావుల మోటార్లు చెడిపోయాయి. గ్రామంలో బోరుబావులు ఉన్నా వాటికి మోటార్లు బిగించకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో మంచినీళ్లకు సంబంధించిన బోరుబావి వృథాగా ఉంది. దీంతో బీసీ, ఎస్సీ కాలనీల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులకు గురవుతున్నారు. గాంధారి మండల పరిధిలోని సోమ్లానాయక్ తండా, కర్ణంగడ్డ తండా, గుడివెనుక తండా, జెమిని తండా, డప్పు తండా తాగు నీటి సమస్య తీవ్రంగా నెలకొంది. నాగిరెడ్డిపేట మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ, మండలంలోని మాల్తుమ్మెద గ్రామపంచాయతీ పరిధిలోని బద్యానాయక్‌తండాలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని సోమర్యాగడి తండాలో తాగునీటి కష్టాలు వేధిస్తున్నాయి. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే నీటిలో చెత్తాచెదారం, పురుగులు వస్తున్నాయని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదాశివనగర్ మండలంలోని అమర్లబండ గ్రామంలో ఏళ్లుగా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం లేవగానే యువకులు తమ ద్విచక్రవాహనాలపై నీళ్లు తెచ్చుకుంటున్నారు.


రామారెడ్డి: తండాల్లోని పొలాల వద్ద నుంచి నీళ్లు తీసుకువస్తున్న మహిళలు

బాన్సువాడ నియోజకవర్గంలో..


కాద్లాపూర్‌లో ఉన్న ఒకే ఒక్క బోరు

బాన్సువాడ మండలం కాద్లాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ నల్లాల ద్వారా 4 బిందెలకు మించి నీళ్లు రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. హనుమాన్ మందిరం వద్ద ఉన్న ఒకే బోరు ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. అలాగే మండలంలోని రాజారాం దుబ్బ, హన్మాజీపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని అవాజ్‌పల్లి తండాలోనూ తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది.


సుల్తాన్‌పేట్‌లో బోరు వద్ద నీరు పట్టుకుంటున్న మహిళ

జుక్కల్ నియోజకవర్గంలో...

మద్నూర్ మండలంలోని సుల్తాన్‌పేట్‌లో తాగునీటికి కటకట నెలకొంది. వేసవికాలం ప్రారంభం కావడంతో గ్రామంలోని బోర్లు ఎత్తిపోయాయి. నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లో ఇంటింటికి కుళాయిల ద్వారా మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుంది. ఆయా గ్రామాలు, గిరిజన తండాల్లో తాగునీటిని మహిళలు, యువకులు మోటార్ సైకిళ్లపై తెచ్చుకుంటున్నారు. పిట్లం మండలంలోని అన్నారం గ్రామంలో నీటి సమస్య నెలకొంది. వ్యవసాయ భూముల వద్ద గల బోర్ల నుంచి నీటిని మహిళలు తెచ్చుకుంటున్నారు. పెద్దకొడప్‌గల్ మండలం కుబ్యానాయక్ తండా,పోచారం తండా, సముందర్ తండా, మనిసిరాం తండాల్లో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంది.మిషన్ భగీరథ ద్వారా నీరు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిచ్కుంద మండలం ఎల్లారంతండా, బిచ్కుంద, శాంతాపూర్ ఆయా గ్రామాలలో నీటి సమస్య నెలకొంది. మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తెచ్చుకొని తాగుతున్నారు.


కామారెడ్డి రూరల్: దేవునిపల్లిలోని ఎస్సీ కాలనీలో కుళాయి వద్ద స్థానికులు


నిజాంసాగర్: కొనతండా నుంచి నడిమితండాకు నీటిని తీసుకువస్తున్న యువకుడు

కామారెడ్డి నియోజకవర్గంలో...

రాజంపేట మండలం బస్వన్నపల్లి గ్రామంలో నీటి కష్టాలు వేధిస్తున్నాయి. గ్రామంలోని ఓ ఊట బావి వద్ద సుమారు 15 మోటారు పంపుల ద్వారా నీటిని తోడుతున్నారు. కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్‌కాలనీ, శ్రీరాంనగర్, రుక్మిణికుంట, కాకతీయనగర్, ఎన్జీవోస్‌కాలనీ, విద్యానగర్, స్నేహపురి, శ్రీనివాస్‌నగర్, పెద్ద బజార్, హరిజనవాడ, ఇస్లాంపూర తదితర కాలనీల్లో, అలాగే దేవునిపల్లి ఎస్సీ కాలనీలో తాగు నీటి ఎద్దడి నెలకొంది. గత 10 రోజుల నుంచి రక్షిత వాటర్ ట్యాంకు నుంచి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోయారు. తరచూ పైప్‌లైన్‌లు పగిలిపోతుండటంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. భిక్కనూరు మండలంలోని జంగంపల్లి లక్ష్మీనగర్ తండాలో నీటి ఎద్దడి తీవ్రంగా నెలకొంది. తండావాసులు వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నారు. బీబీపేట మండలం యాడారం, శివారు రాంరెడ్డిపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. బోరు మోటర్లు పాడవుతున్న పట్టించుకునే వారు లేరు.దోమకొండ మండలం ముత్యంపేటలో తాగునీటి సమస్య నెలకొంది. గ్రామంలో 5 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది.


బీబీపేట: యాడారం ఎస్సీ కాలనీలో బోరు వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు


దోమకొండ : ముత్యంపేటలో బిందెలతో నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని వెల్లుట్లపేట గ్రామంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేయాలని కాంగ్రెస్ నాయకులు కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, రాజాగౌడ్, మల్లేష్, గణపతి తదితరులున్నారు.


హస్నాపూర్‌లో ..

హస్నాపూర్ గ్రామంలో ...

పిట్లం(జుక్కల్): మండలంలోని హస్నాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 5 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ రోడ్డు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శాబ్దిపూర్‌లో రెండు తలల పాము



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామంలో ఆదివారం రెండు తలల పాము కనిపించింది. గ్రామానికి చెందిన రాజేష్ రెడ్డి తన పొలం వద్దకు వెళ్లగా రెండు తలలతో ఉన్న పాము పిల్లను చూశాడు. తెల్లగా ఉన్న పాము పిల్లను అక్కడున్న కొందరు రైతులు ఆసక్తిగా గమనించారు. కొద్దిసేపటికి పాము పిల్ల పొదల్లోకి వెళ్లిపోయింది.

కేటీఆర్, జగదీశ్ రెడ్డిల దిష్టిబొమ్మలు దహనం


బాన్సువాడలో ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


బీబీపేటలో..


గోపాల్‌పేటలో ...


నిజాంసాగర్‌లో ..


ఎల్లారెడ్డిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి నెట్ వర్క్: రాష్ట్ర అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. ఈసందర్భంగా పలు చోట్ల ఆదివారం కేటీఆర్,జగదీశ్‌రెడ్డిల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



నిజాంసాగర్(జుక్కల్): మండంలోని శేర్‌ఖాన్‌పల్లి గ్రామంలో ఆదివారం వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తుల భజనలు, హనుమాన్ చాలీసా పారాయణంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈసందర్భంగా యజ్ఞం, హోమ కార్యక్రమాలు, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ దాత నరేందర్ రెడ్డి, పంచాయతన విగ్రహాల దాతలు అనిల్‌సేట్, తాటిపల్లి సరస్వతి, రఘుగౌడ్, వినోద్‌సేట్, జ్యోతిని వేద పండితులు, గ్రామస్తులు సన్మానించారు.

ఘనంగా పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 25వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం పెద్దమ్మ పెద్దరాజులకు వివాహం జరిపించారు.

మత్తడి పోచమ్మ ఆలయం వద్ద వేలం పాట

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద సోమవారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు శంకర్‌గౌడ్, దూరిశెట్టి అశోక్‌లు తెలిపారు. ఉగాది సందర్భంగా ఆలయం వద్ద వారం రోజుల పాటు జాతర నిర్వహిస్తారు. ఇందు కోసం ఆలయం వద్ద కొబ్బరికాయలు, ఆలయం హుండీ, పూజారులు, సంవత్సరం వరకు వతన్ ఏర్పాటు చేయడానికి వేలం పాటలు నిర్వహిస్తామన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయ నిర్మాణానికి గంగపుత్ర సంఘం సభ్యులు ఆదివారం రూ. 31000 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్, మారుతి, నారాగౌడ్, బాలయ్య, సాయిలు, రాజు, ఆగమయ్య, ఎల్లమయ్య, పోచయ్య, రఫయోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఓంకారేశ్వర ఆలయ ఉత్సవాలు



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీలో గల ఓంకారేశ్వర ఆలయం మూడో వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం చేశారు. ఆలయ ధ్వజస్తంభం ధ్వజారోహణం చేశారు. 50 మంది జంటలతో హోమం నిర్వహించారు. సాయంత్రం వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో పురవీధుల గుండా మహిళలు కలశాల ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కపిల ప్రభాకర్, మాదంశెట్టి ఆంజనేయులు, పట్నం శెట్టి శ్రీనివాస్, గంజి సంగమేశ్వర్, చేవెళ్ల రాజు, పటేల్ రాజు, స్వామి, జీవన్ దేశాయ్, ఆంజనేయులు, ఇంద్ర శేఖర్, శ్రీశైలం, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒరిగిన స్తంభాన్ని సరిచేశారు



సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలోని సహకారబ్యాంకు వద్ద ఒకవైపు ఒరిగిన విద్యుత్‌స్తంభాన్ని ఆదివారం సరిచేశారు. విద్యుత్‌స్తంభం ప్రమాదకరంగా ఒకవైపు ఒరిగిన ఘటనకు సంబంధించి 'సాక్షి'లో శుక్రవారం 'ఒరిగిన విద్యుత్‌స్తంభం'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. దీంతోపాటు విద్యుత్‌వైర్లను సైతం బిగితుగా బిగించారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దు



బాన్సువాడ : పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయవద్దని మండల విద్యాధికారి నాగేశ్వర్ రావు అన్నారు. ఆదివారం బీర్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ద్దేశించి మాట్లాడారు. పరీక్షలంటే భయందోళనకు గురికావద్దని, ఇష్టంతో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులకు సన్మానించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకన్న, మేకల విఠల్, రవీందర్, రాధకృష్ణ, నాయకులు రఘు, సానేపు గంగారం తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2020-21 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిర, కరుణాకర్, కిషన్ లాల్, రమేష్, విద్యార్థులు మానస, సాక్షిత్ గౌడ్, ప్రీతి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రూట్ సలాడ్‌లో పురుగు



బాన్సువాడ : పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తా సమీపంలోని ఓ జ్యూస్ సెంటర్‌లో కొనుగోలు చేసిన ఫ్రూట్ సలాడ్‌లో పురుగు రావడంతో ఆందోళన వ్యక్తం చేశారు. పాత బాన్సువాడకు చెందిన ఓ వ్యక్తి జ్యూస్ సెంటర్‌లో కొనుగోలు చేసిన ఫ్రూట్ సలాడ్‌ను అతని కుమారుడు తింటుండగా పురుగు కనిపించింది. ఈ తండ్రికి చెప్పడంతో జ్యూస్ సెంటర్‌కు వచ్చి వ్యాపారిని నిలదీశాడు.

పొట్టి శ్రీరాములుకు నివాళి



కామారెడ్డి అర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక సిరిసిల్లరోడ్డులోని ఆయన విగ్రహానికి ఆర్యవైశ్య, వాసవీ క్లబ్ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎం.భూమేష్, ప్రధాన కార్యదర్శి కూర శ్రీనివాస్, వాసవీ ప్రతినిధులు పార్శి కాంశెట్టి, వి.భాస్కర్, వి.శ్రీధర్, ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్య సమాజ్ వజ్రోత్సవాలు



రామారెడ్డి: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర ఆలయంలో ఆర్య సమాజ్ వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం యజ్ఞం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

సంక్షిప్తం

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

బాన్సువాడ : పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు అన్నారు. 2024-2025 ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఇంటి పన్నులు, వృత్తి, వ్యాపార లైసెన్సులు, కుళాయి పన్నులు చెల్లించాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పన్నుల బకాయిలు పేరుకుపోయాయని, పన్నులు చెల్లించని వారిపై మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారికి 25 శాతం రిబేట్ వస్తుందని, ఈ నెల 31 వరకు ఉందని, ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నృసింహుడి ఆలయంలో కుంకుమార్చనలు

మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ఆదివారం కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఒడిబియ్యం, తొట్టెలు కట్టించడం, ముడుపులు, మొక్కులను భక్తులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈవో శ్రీధర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, అర్చకులు నర్సింహాచార్యులు, శ్రీనివాస్‌చార్యులు, పరందామచార్యులు, సంజీవాచార్యులు ఉన్నారు.

నేడు గోపాల్‌పేటలో తైబజార్ వేలం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రం గోపాల్‌పేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉదయం 11గంటలకు 2025-26కు సంబంధించిన తైబజార్ వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు. 01 ఏప్రిల్ 2025 నుంచి 31మార్చి 2026 వరకు పంచాయతీ పరిధిలో తైబజార్ వసూలు చేసుకోవచ్చని ఆయన చెప్పారు. తైబజార్‌కు కనీస ధర రూ.4లక్షల57వేలుగా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు ముందుగా రూ.50వేలు డిపాజిట్ చేయాలని, ఉదయం 11గంటలకు తమ కార్యాలయంలో వేలంపాట మొదలవుతుందని ఆయన వివరించారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల ప్రజలు ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆదివారం ఎంపీడీవో నరేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారికి 25 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం సేవించి వాహనాలు నడుపొద్దు


ఎల్లారెడ్డిలో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి: మద్యం సేవించి వాహనాలను నడుపొద్దని ఎస్సై మహేష్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించారు. వాహనాలను నడుపుతున్న పలువురికి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులున్నారు.